ఎమ్మెల్యేకి ఆహ్వానం

సనత్‌నగర్: తెలంగాణ సంస్కృతిని తెలిపేలా నిర్వహించే అలయ్ బలయ్ కార్యక్రమానికి సనత్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌యాదవ్‌ను నిర్వాహకులు ఆహ్వానించారు. శుక్రవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను అలయ్ బలయ్ చైర్‌పర్సన్ బండారు విజయలక్ష్మి కలిసి అక్టోబర్ 3న నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించే అలయ్ బలయ్ కార్యక్రమానికి హాజరుకావాలని కోరుతూ ఆహ్వానం అందజేశారు.

జీతాలు పెంచాలి

లాలాపేట: ఓయూ హాస్టల్ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని, జీతాలు పెంచాలంటూ శుక్రవారం ఓయూ చీఫ్ వార్డెన్ శ్రీనివాస్‌ను టీయూసీఐ అనుబంధ ప్రోగ్రెసివ్ కాంట్రాక్ట్ అండ్ క్యాజువల్ వర్కర్స్ యూనియన్ ఓయూ కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎస్ఎల్ పద్మ, ప్రదీప్, శివాజీ, శంకర్, విజయ, ఈశ్వరయ్య తదితరులు ఉన్నారు.

గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్టు

సికింద్రాబాద్: గంజాయి వ్యాపారం చేస్తున్న వ్యక్తి శుక్రవారం సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు పట్టుబడ్డాడు. నిందితుడి నుంచి రూ. 18.254 కిలోల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ డీఎస్పీ ఎస్ఎన్ జావెద్, ఇన్‌స్పెక్టర్ బీ.సాయీశ్వర్‌గౌడ్ వివరాల మేరకు.. మహారాష్ట్ర జైనా టౌన్‌కు చెందిన రవి హీరాలాల్ చౌదరి (32) ఒడిశా వెళ్లి గంజాయి సేకరించి, అక్కడి నుంచి రైలు ద్వారా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. ఇక్కడి నుంచి దేవగిరి రైలు ద్వారా తిరుగు ప్రయాణం చేసేందుకు టికెట్ కొనుగోలు చేస్తున్న అతడిని సికింద్రాబాద్ రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా విషయం వెలుగు చూసింది. నిందితుడిపై కేసులు నమోదు చేసి, పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

ఘనంగా ఎన్ఐఎన్ ఫౌండేషన్ డే



లాలాపేట: ఐసీఎంఆర్–జాతీయ పోషకాహార సంస్థ ఫౌండేషన్ డే వేడుకలను శుక్రవారం తార్నాకలోని ఎన్ఐఎన్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. ఎన్ఐఎన్ డైరెక్టర్ డాక్టర్ భారతీ కులకర్ణి స్వాగతోపన్యాసం చేశారు. ఈ కార్యక్రమానికి ఐసీఎంఆర్ డైరెక్టర్ జనరల్ డా.రాజీవ్ బహ్ల్ వర్చువల్‌గా హాజరై, కీలక ప్రసంగించారు. తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ప్రసిడెంట్ డా. సీహెచ్. మోహన్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఏఐ ఆధారిత పోషకాహారం, రోగ నిర్ధారణ సాధనాల్లో ఆవిష్కరణలను ప్రదర్శించే ఇన్స్యూజ్ న్యూట్రీషన్ ఇన్నోవేషన్ సమ్మిట్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. పదవీ విరమణ చేసిన పలువురిని సన్మానించారు. పలువురు ఎన్ఐఎన్ సైంటిస్టులకు మూడవ తుల్పులే అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ అనురాగ్ భార్గవ్, డాక్టర్ సుబ్బారావు, రవీంద్రనాథ్ తదితరులున్నారు.

గుడులకు నోటీసులు ఇవ్వడమేంటి?

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గం అన్నానగర్‌లో పలు ఆలయాలు ఖాళీ చేయాలంటూ డిఫెన్స్ ఎస్టేట్స్ అధికారులు నోటీసులు జారీ చేయడం దారుణమని బీఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధి మన్నె కృషాంక్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం సికింద్రాబాద్ సర్కిల్ డిఫెన్స్ ఎస్టేట్స్ ఆఫీసర్ దినేశ్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అన్నానగర్‌లోని చాలా ఆలయాలు 60 ఏళ్లకు పూర్వమే నిర్మితమయ్యాయన్నారు. ఇటీవల కాలంలో కొత్తగా ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేదన్నారు. ప్రజల విశ్వాసం, భక్తికి ప్రతీకలు వీటిని ఆక్రమణలుగా పేర్కొనడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నామన్నారు. జారీ చేసిన నోటీసులను ఉపసంహరించుకోవాలని కోరారు.

లష్కర్ జిల్లా సాధన సమితి మహిళా అధ్యక్షురాలిగా గీత



లాలాపేట: సికింద్రాబాద్ శాంతినగర్‌కు చెందిన ముత్యాల గీతాదయాకర్‌రావు లష్కర్ జిల్లా సాధన సమితి జిల్లా మహిళా అధ్యక్షురాలిగా నియమితులయ్యారు. శుక్రవారం లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్ కుమార్‌గౌడ్ శాంతినగర్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొని లష్కర్ జిల్లా సాధన ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం గీతాదయాకర్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సాధం బాల్‌రాజ్ యాదవ్, శైలేందర్, సునీల్ ముదిరాజ్, సుజాత, సుగుణ, శోభ, రేఖ, నాగేశ్వర్ రావు గౌడ్, శ్రీనివాస్ గౌడ్, కుమార్, మల్లికార్జున్, పొన్నాల రాజు తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి నమోస్తుతే



అమీర్‌పేట: లలితాత్రిపురసుందరీ దేవిగా ..

అమ్మవారి ఆలయాలతో పాటు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాల్లో కొలువుదీరిన దుర్గాదేవి భక్తజనంతో పూజలు అందుకుంటోంది. దేవీ నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆలయాలు భక్తులతో పోటెత్తుతున్నాయి. రోజుకొక ప్రత్యేక అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారిని కన్నులారా వీక్షించి తరించేందుకు భక్తులు క్యూ కడుతున్నారు. పలుచోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆధ్యాత్మిక సంద్రంలో మునిగితేలేలా చేస్తున్నాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆయా ఆలయాల నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కాగా ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు లక్ష్మీదేవీగా దర్శనమిచ్చారు.

– సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ జోన్ బృందం



గజలక్ష్మిదేవి అలంకారంలో..



మహాలక్ష్మి అలంకరణలో..



గజలక్ష్మి అలంకరణలో..



శ్రీలలితాదేవి అలంకారంలో ..



కంటోన్మెంట్: నల్లపోచమ్మ ఆలయంలో పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేశ్, జంపన ప్రతాప్



రాంగోపాల్‌పేట్: మహంకాళి అమ్మవారికి పూజలు చేస్తున్న కార్పొరేటర్ సుచిత్ర



పార్శిగుట్ట అశోక సేవాసంఘంలో బీజేపీ నాయకులు



సికింద్రాబాద్: మధురానగర్ బంగారు మైసమ్మ ఆలయంలో ..



సీతారాంనగర్ కనకదుర్గ అమ్మవారి దేవాలయంలో ..



కుంకుమార్చన పూజల్లో పాల్గొన్న కోట నీలిమ



మంటపంలో పూజలు చేసిన మాజీ ఎమ్మెల్సీ

బతుకమ్మ ఉత్సవాలకు రండి



మంత్రిని ఆహ్వానిస్తున్న కమిటీ సభ్యులు

సనత్‌నగర్: తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు నిలువుటద్దంగా నిలిచే బతుకమ్మ ఉత్సవాలకు హాజరుకావాలని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను జెక్‌కాలనీ ఉత్సవ కమిటీ సభ్యులు శుక్రవారం ఆహ్వానించారు. ఈ నెల 29న జెక్‌కాలనీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ బతుకమ్మ చౌరస్తాలో వైభవంగా జరిగే సద్దుల బతుకమ్మ వేడుకల్లో పాల్గొనాలని వారు విజ్ఞప్తి చేశారు. మంత్రిని కలిసిన వారిలో జెక్‌కాలనీ ఫెడరేషన్ అధ్యక్షుడు మల్లు ప్రసాద్, బతుకమ్మ ఉత్సవ కమిటీ అధ్యక్షురాలు చింతిరెడ్డి ప్రభ, ప్రధాన కార్యదర్శి అన్నపూర్ణలతో పాటు సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా సీసీఎంబీ ఓపెన్ డే



అవగాహన కల్పిస్తున్న యంగ్ సైంటిస్టులు

లాలాపేట: సీఎస్ఐఆర్ 84వ ఫౌండేషన్ డేను పురస్కరించుకొని సెంటర్ ఫర్ సెల్యూలర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ(సీసీఎంబీ) ఓపెన్ డే కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సీసీఎంబీలో శాస్త్రవేత్తలు తమ పరిశోధనా శాలలను విద్యార్థుల కోసం అందుబాటులో తెరిచి ఉంచారు. వారు చేస్తున్న పరిశోధనా అంశాలపై ఎగ్జిబిట్స్, పోస్టర్ ప్రదర్శనను ఏర్పాటు చేసి, అక్కడికి వచ్చిన విద్యార్థులకు వివరించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు, మహారాష్ట్ర నాందేడ్ నుంచి పలు పాఠశాలలు, కళాశాలల నుంచి దాదాపు 4 వేల మంది విద్యార్థులు ఈ ఓపెన్ డేకు హాజరయ్యారు. అక్కడ ఏర్పాటు చేసిన ఎగ్జిబీషన్‌లు, పోస్టర్ ప్రదర్శనను తిలకించారు.

18 స్టాల్స్‌ను ఏర్పాటు చేశాం



సీసీఎంబీ డైరెక్టర్ డా. వినయ్ నందుకూరి మార్గదర్శకత్వంలో చీఫ్ సైంటిస్టు డాక్టర్ విష్ణుప్రియ నేతృత్వంలో ఈ ఓపెన్ డేలో వివిధ పరిశోధనా అంశాలకు సంబంధించి దాదాపు 18 స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో ప్రధానంగా లీవర్ ల్యాబ్, లీవర్ ఫంక్షన్, ఎండు తెగుళ్ల నుంచి తట్టుకునేలా వరి వంగడాలతో తదితర అంశాలపై మోడల్స్‌ను, పోస్టర్లను ప్రదర్శించాం.

– డా. విష్ణుప్రియ. చీఫ్‌సైంటిస్టు, సీసీఎంబీ

నిర్ణీత సమయంలో రజక భవన్ నిర్మించాం



భవనాన్ని ప్రారంభిస్తున్న మహేశ్వర్ రెడ్డి

కంటోన్మెంట్: ఇచ్చిన హామీ మేరకు నిర్ణీత సమయంలో రజక భవన్ నిర్మించి ఇచ్చామని బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి అన్నారు. చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని బోయిన్‌పల్లిలో నూతనంగా నిర్మించిన రజక భవన్‌లో బోర్డు మాజీ సభ్యులు పాండుయాదవ్, శ్యామ్ కుమార్, నళిని కిరణ్, అనిత ప్రభాకర్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో ప్రారంభమైన రజక భవన్ నిర్మాణం నిధుల లేమితో అసంపూర్తిగా నిలిచిపోయింది. స్థానికుల కోరిక మేరకు రూ.10 లక్షల సొంత నిధులతో నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించారు. అనంతరం రజక భవన్‌లో చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులు అర్పించారు. రజక సంఘం అధ్యక్షుడు రమేశ్, ఉపాధ్యక్షురాలు కమలమ్మ, రాజు తదితరులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మకు ఘన నివాళి

కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్



చాకలి ఐలమ్మకు నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్, సీఈవో మధుకర్‌నాయక్



ఓయూలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బీసీ విద్యార్థి నేతలు

రాంగోపాల్‌పేట్: వీరనారి చాకలి ఐలమ్మ జీవితం నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. శుక్రవారం సిఖ్‌విలేజ్ దోబీఘాట్ రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే కంటోన్మెంట్ బోర్డు సీఈవో మధుకర్ నాయక్, బీజేపీ నాయకులు, బీఆర్ఎస్ నాయకులు ఐలమ్మకు నివాళులర్పించారు.

బౌద్ధనగర్: చాకలి ఐలమ్మ జయంతిని వారాసిగూడ పుల్లయ్య బావి బస్తీలో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సాయిప్రసాద్‌గౌడ్ అధ్యక్షతన రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ స్వరూపగౌడ్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

లాలాపేట: వీరనారి చాకలి ఐలమ్మ జయంతిని శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కళాశాలలో బీసీ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో బీసీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సైదులు యాదవ్, అశోక్, రమేశ్, నూక మధు, అభిరామ్, కోలా శేఖర్, ప్రమోద్ తదితరులున్నారు.

ఆర్పీఎఫ్ రైజింగ్ డేలో రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఆర్పీఎఫ్ పోలీసులు

అడ్డగుట్ట: రక్తదానం ఎంతో గొప్పదని ఆర్పీఎఫ్ సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ ఆలకుంట నవీన్‌కుమార్ అన్నారు. ఆర్పీఎఫ్ రైజింగ్ డే వేడుకల్లో భాగంగా సికింద్రాబాద్ రైల్ నిలయంలోని ఆడిటోరియంలో దక్షిణ మధ్య రైల్వే పీఎస్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఆర్పీఎఫ్ పోలీసులు పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సీనియర్ డీఎస్‌సీ ఆలకుంట నవీన్‌కుమార్ మాట్లాడారు. ఆర్పీఎఫ్ రైజింగ్ డే లో భాగంగా వివిధ సేవా కార్యక్రమాల్లో భాగంగా 35 మంది ఆర్పీఎఫ్ పోలీసులు రక్తదానం చేశారన్నారు. కార్యక్రమంలో ఐజీ అరోమాసింగ్, డీఐజీ షాదాన్ జెబ్‌ఖాన్, ఏఎస్‌సీ నరేందర్ కుమార్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో విద్యా కమిషన్ బహిరంగ విచారణ

లాలాపేట: విద్యారంగంలో సమస్యల పరిష్కారం దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన విద్యా కమిషన్ శుక్రవారం ఓయూలో బహిరంగ విచారణ నిర్వహించింది. ఓయూలో విద్యా పరిస్థితులు, సమస్యలు సవాళ్లు, పరిష్కార మార్గాలపై అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు, అధికారుల నుంచి సమాచారాన్ని సేకరించారు. ఓయూ పాలనా భవనం సెనెట్ హాల్లో జరిగిన ఈ సమావేశంలో విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, కమిషన్ సభ్యులు ప్రొ. పీఎల్ విశ్వేశ్వర్‌రావు, డా. చారగొండ వెంకటేష్, జ్యోత్స్న శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ.. ఈ విచారణలో సేకరించిన సమాచారం ఆధారంగా ప్రభుత్వానికి నివేదిక ఇస్తామన్నారు. ఆయా కళాశాలల డీన్లు, హెచ్‌ఓడీలు, ఉద్యోగులు, విద్యార్థులు దాదాపు 200 మంది పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు.

అగ్ని ప్రమాదం

అడ్డగుట్ట: తుకారాంగేట్‌లోని ఓ ఇంట్లో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవించి పలు సామగ్రి దగ్ధమైన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే, తుకారాంగేట్‌లోని నందనార్‌నగర్‌లోని ఓ పెంట్ హౌస్‌లో శుక్రవారం మధ్యాహ్నం సమయంలో ఇంట్లో దేవుడి ఫొటో వద్ద ఉన్న దీపం ప్రమాదవశాత్తు పరదాకు అంటుకుంది. ఈ క్రమంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు, ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఎవరికీ ఏ ప్రమాదం జరగలేదన్నారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి

కంటోన్మెంట్: కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి అని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. నియోజకవర్గంలో మారేడ్‌పల్లి మండలానికి చెందిన 9 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను తహసీల్దార్ నైనావత్ రాజు నాయక్‌తో కలిసి పంపిణీ చేశారు.

ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్

మంద కృష్ణమాదిగ విమర్శ



సికింద్రాబాద్: అధికారంలోకి రాకముందు ఒక మాట, గద్దెకు ఎక్కిన తర్వాత మరోమాట అన్న చందంగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ వ్యవహరిస్తుందని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ విమర్శించారు. శుక్రవారం సీతాఫల్‌మండి బీఎస్ఆర్ గార్డెన్‌లో సికింద్రాబాద్ నియోజకవర్గ వృద్ధులు, వికలాంగులు, వితంతువుల సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంద కృష్ణమాదిగ మాట్లాడుతూ.. దివ్యాంగులకు రూ.6వేలు, ఇతర పెన్షన్‌దారులకు రూ.4 వేలు నెలసరి ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి సీఎం కుర్చీ ఎక్కగానే పెన్షనర్లకు మొండిచెయ్యి చూపించారని విమర్శించారు. మహాగర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంద కృష్ణమాదిగ పిలుపునిచ్చారు. సమావేశంలో పెన్షన్‌దారుల సంఘం, ఎంఆర్‌పీఎస్ ప్రతినిధులు రాంబాబు, దయామణి, కళాజ్యోతి, వాణి సంతోషి, దావా శివప్రసాద్, ఎడ్ల రుద్రి, వేణుగోపాల్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సొంతింటి కల సాకారం చేసిన ఘనత కాంగ్రెస్‌దే

చిలకలగూడ: సొంతింటి కల సాకారం చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని సికింద్రాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్ అన్నారు. సీతాఫల్‌మండి డివిజన్ సుభాష్ చంద్రబోస్‌నగర్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాలు ఇప్పించడంతో కృషి చేసిన సంతోష్‌కుమార్‌ను లబ్ధిదారులు సన్మానించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు అభిషేక్, అనీల్‌కుమార్, రవిచంద్ర కుమార్, బ్రహ్మాజీ, నాయకులు జలంధర్‌రెడ్డి, అమర్నాథ్‌గౌడ్, సందీప్‌రాజ్, వహిదుద్దీన్, శిల్పాచారి, గంటరాజు, కిషోర్ యాదవ్ పాల్గొన్నారు.

28న ఎంట్రెన్స్ టెస్టు

లాలాపేట: ప్రొఫెసర్ జి. రామ్‌రెడ్డి దూర విద్యా కేంద్రం ఆధ్వర్యంలో 2025–26 విద్యా సంవత్సరానికి ఎంబీఏ, ఎంసీఏ రెండేళ్ల సెమిస్టర్ సిస్టమ్ కోర్సులో ప్రవేశానికి నోటిఫికేషన్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఈ కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 28న ఎంట్రెన్స్ ఎగ్జామ్ నిర్వహిస్తామన్నారు.

యోగా, ధ్యానంతో గుండె పదిలం



అవగాహన కల్పిస్తున్న వైద్యులు

సనత్‌నగర్: ఒత్తిడితో కూడిన జీవనశైలితోనే యువతలో గుండె సంబంధిత సమస్యలు పెరుగుతున్నాయని, యోగా, ధ్యానంతో ఒత్తిడిని తగ్గించి, గుండె ఆరోగ్యాన్ని కాపాడొచ్చని బేగంపేట కిమ్స్ సన్‌షైన్ హాస్పటల్ కార్డియాలజీ విభాగం అధిపతి డాక్టర్ శ్రీధర్ కస్తూరి తెలిపారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా కిమ్స్ సన్‌షైన్ హాస్పటల్‌లో గుండె సంబంధ వ్యాధులు, ఆధునిక శస్త్ర చికిత్సలు అనే అంశంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీధర్ కస్తూరి 'డోంట్ మిస్ ఏ బీట్' అనే అంశంపై మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ప్రతీ సంవత్సరం 1.7 కోట్లకు పైగా మరణాలు గుండె సంబంధ సమస్యలతో సంభవిస్తున్నాయన్నారు. శారీరక శ్రమ, అసమతుల్య ఆహారం, మానసిక ఒత్తిడి యువతలో గుండె సమస్యలకు కారణమవుతున్నాయన్నారు. చిన్న చిన్న స్కానింగ్‌లు, పరీక్షలతో ముందుగానే ప్రమాద సూచికలను గుర్తించవచ్చని చెప్పారు. కూరగాయలు ఎక్కువగా తీసుకోవడం, ఉప్పు, చక్కెర తక్కువ తీసుకుంటూ, కొవ్వును తగ్గించుకోవడం, ప్రతి రోజూ వ్యాయామం, స్మోకింగ్, మద్యపానాన్ని తగ్గించాలని చెప్పారు. ఈ సమావేశంలో సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ శైలేందర్‌సింగ్, డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి, కార్డియోథొరిసిక్ సర్జన్లు, డాక్టర్ పీఎస్‌రావు, డాక్టర్ సందీప్, డాక్టర్ శ్రీధర్‌శాస్త్రి, కార్డియాలజిస్టులు రాజారాం, ప్రణయ్, పార్థసారధి, సురేందర్, కావ్య, ప్రశాంత్, హిమాన్షు, అపరంజి తదితరులు పాల్గొన్నారు.